క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



తెనాలి: ప్రముఖ సినీనటుడు ప్రభాస్ జన్మదినం సందర్భంగా సోమవారం స్థానిక గురవయ్య కాలనీ డ్రైనేజి డొంకరోడ్డులో వేడుకలను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నేత కఠారి హరీష్ కేక్ కట్ చేశారు. అక్కడి స్కూలు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రభాస్ ఫాన్స్ సీహెచ్ తిరపతయ్య, వద్ది ఏడుకొండలు, పొట్లూరి నాగరాజు, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ పొట్లూరి అశోక్, మేదరమెట్ల క్రాంతి, పొట్లూరి సాయి, సీహెచ్ మహంకాళిరావు, ఆదిరెడ్డి, తలపల తిరపతయ్య, మెండు కుమార్, కొమరగిరి శివయ్య, పొట్లూరి ఏడుకొండలు, టి.పోలిరెడ్డి పాల్గొన్నారు.

27న జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ



తెనాలిఅర్బన్: జీఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జరగనున్న జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ కరపత్రాలను వైఎస్సార్‌సీపీ ఒకటోవ వార్డు కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలపై యువత ఆసక్తిని చూపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు నాలాది ప్రభాకర్, నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు, గెడ్డేటి మహేష్, సీమోను, అబజిత్, విలియమ్స్, ప్రభాకర్, భాస్కర్, ప్రకాష్, తేజ పాల్గొన్నారు.

రూ.10 వేలు ఆర్థికసాయం



తెనాలిఅర్బన్: 16వ వార్డుకు చెందిన షేక్ కాశీం, నూర్జహాన్‌ల కుమారుడు సాధిక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు అక్కిదాసు కిరణ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు జూపల్లి వంశీ సహకారంతో రూ.10 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం బాలుడి తండ్రి ఖాసీంకు అందజేశారు. మంగళవారం రైల్వేస్టేషన్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఎరుకల ప్రజా సంఘం అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు, కసుకుర్తి మల్లేశ్వరరావు, నల్లగండ్ల రవిచంద్ర, పసుపులేటి శ్రీహర్ష, పిల్లి అజిత్, ఆనంద్‌కుమార్, షేక్ జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

తాడేపల్లిరూరల్: కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేసిన ఘటన తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణానది కనకదుర్గ వారధి వద్ద మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ గిరిబాబు అందించిన వివరాలు.. కోడి పందేలు నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు శిబిరంపై దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరి నుంచి రూ.63 వేలు, పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ



వడ్డమాను(తాడికొండ): తుళ్లూరు మండలం వడ్డమానులో ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడిన పది మంది ఉద్యోగులు వెల్ విషర్ టీం ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా 15 మంది వృద్ధులు, పేదలకు నిత్యావసరాలు, రగ్గులు అందించారు. గ్రామంలో ఉత్తమ ప్రతిభతో ఉత్తీర్ణత సాధించిన కూరపాటి అంజలికి ఇంటర్ ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతుండగా స్పందించి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. తొలి విడత సాయంగా రూ.9 వేలు ఫీజు చెల్లించిన రసీదు అందజేశారు. కార్యక్రమంలో వెల్ విషర్ అధ్యక్షుడు మాజీ సబ్ రిజిస్ట్రార్ బెజ్జం నాగేశ్వరరావు, బెజ్జం ఫౌండేషన్ అధ్యక్షుడు బెజ్జం రామకృష్ణారావు, వెల్ విషర్ సభ్యులు ఉపాధ్యాయులు కొమరాబత్తిన స్టీవెన్, మంటి సాంబశివరావు, కాకి శ్యామ్, యూనియన్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పళ్ళం రవికుమార్, రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ మేరుగ రత్తయ్య పాల్గొన్నారు.

ఘనంగా విజయదశమి వేడుకలు

- ముగిసిన దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు
- గంగానమ్మపేట శివాలయంలో స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే శివకుమార్
- వాసవీ ఆలయలో వైభవంగా రథోత్సవం
- వివిధ ఆలయాల్లో విశేషంగా పూజలు




శివాలయంలో పట్టు వస్త్రాలను అర్చకులకు సమర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. విజయదశమి వేడుకలను ప్రజలు సోమ, మంగళవారాల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలు ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి. పట్టణ, రూరల్ గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు జరిపి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణ గంగానమ్మపేటలోని శివాలయంలో విజయదశమి సందర్భంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రమణకుమారి, మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పాల్గొన్నారు. దేవిచౌక్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఎమ్మెల్యే శివకుమార్ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శివకుమార్, మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ హరిప్రసాద్‌లను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. చెంచుపేటలోని గాయత్రీనగర్‌లో గాయత్రీదేవి శ్రీ శక్తి పీఠంలో నిర్వహించిన ప్రత్యేక పూజ, హోమంలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు.

+ గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో బాలస్వామిజీ పర్యవేక్షణలోసాలీగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న దేవిశర్నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అమ్మవారి రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయనే అభిషేకాలు, పూజలు జరిపి లలితా సహస్రపారాయణం చేశారు. కార్యక్రమంలో ట్రస్టీ జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, ఉప్పల నాగేశ్వరరావు, గోపు రామకృష్ణ, చుండూరు లోకనాథం, రాజేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం రథోత్సవం నిర్వహించారు. ఆలయంల్లో కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పుష్పశయనిగా అలంకరణ చేశారు. రాజరాజేశ్వరి దేవికి రాజరాజేశ్వరిదేవి అలంకరణ చేశారు. అమ్మవారి రథోత్సవాన్ని దేవస్థాన కమిటీ చైర్మన్ నూకల వేణు ప్రారంభించారు. పట్టణంలో రథోత్సవాన్ని నిర్వహించారు.

+ అంగలకుదురులో కనకదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని మంగళవారం సాయంత్రం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే శివకుమార్ నడిపారు. రూరల్ మండలం నందివెలుగులోని కనకదుర్గా అమ్మవారి ఆలయంలో విజయదశమి పండుగ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహాలక్ష్మీ అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ధూళ్లిపాళ్ల పవన్‌కుమార్, అగస్తేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ తన్నీరు వెంకటేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి తమ్మా శివారెడ్డి, పాల్గొన్నారు. మారీసుపేట శివాలయంలో శివాలయంలో అమ్మవారికి శ్రీ పుష్పశయనిగా అలంకరణ చేశారు. పట్టణంలోని రామలింగేశ్వరపేటలోని శివాలయం, కొత్తపేటలోని అష్టలక్ష్మి ఆలయం, వివిధ ఆలయాల్లో విజయదశమి వేడుకలు ఈ సందర్భంగా సాంస్కృతి కార్యక్రమాలు జరిపారు.



నందివెలుగులో మహాలక్ష్మిదేవి అలంకరణలో అమ్మవారు



వాసవీ ఆలయంలో రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న దేవస్థాన కమిటీ అధ్యక్షుడు నూకల వేణు



శ్రీ విద్యాపీఠంలో పూజలు అందుకుంటున్న అమ్మవారు



మారీసుపేట శివాలయంలో అమ్మవారికి పుష్పశయని అలంకరణ..



హంస వాహనంపై వాసవీ అమ్మవారు



రాజరాజేశ్వరిదేవి ఆలయంలో రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు



అంగలకుదురులో అమ్మవారి ఊరేగింపులో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే శివకుమార్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొల్లిపర: మండలంలోని పిడపర్రు లాకులు వద్ద కృష్ణా నది కరకట్టపై ప్రమాదవశాస్తు కారు, ద్విచక్ర వాహనం ఎదురు ఎదురుగా ఢీ కొన్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. విజయవాడ నుంచి వస్తున్న కారు, వేమూరు మండలం, బలిజపల్లి గ్రామానికి చెందిన గోపిశెట్టి శ్రీనివాసరావు దంపతులు బైక్‌పై విజయవాడకు వెళ్తుండగా ప్రమాదవశాస్తు కారు ఢీ కొట్టతంతో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వటంతో సిబ్బంది స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తెనాలి ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు.

శ్రీ రామసాయి జ్ఞాన మందిరంలో విశేష పూజలు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని శ్రీ రామసాయి జ్ఞాన మందిరంలో మంగళవారం విజయదశమి పండుగ సందర్భంగా షిరిడి సాయి బాబా దివ్య సమాధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు కాకడ హారతి, ఏడు గంటలకు పంచామృత అభిషేకం జరిపారు. షిరిడిలో నిర్వహించే విధంగా బాబావారి దివ్యసమాధి కార్యక్రమాన్ని ఆలయాల్లో ప్రత్యేకంగా జరిపారు. ఉదయం తొమ్మిది గంటలకు లక్ష్మీ గణపతి హోమం, 10 గంటలకు విష్ణు సహస్ర నామ, లలితా సహస్రనామ పారాయణం జరిపారు. ఆధ్యాత్మిక ప్రవచకులు బ్రహ్మశ్రీ నూరి కోదండ రామ్ పురాణ ప్రవచనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని రామసాయి ట్రస్ట్ చైర్మన్ సంకా సతీష్, వైస్ చైర్మన్ మల్లిశెట్టి శ్రీనివాస్, సభ్యులు అకరంశెట్టి నాగేశ్వరరావు, సంకా రవి కుమార్, సీతారామ్, ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ



నగరంపాలెం: ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇశ్రాయేల్‌పేట ఒ కటో వీధిలో సినీ నటుడు ప్రభాస్ పుట్టిన రోజు లు వేడుకలు జరిగాయి. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేయగా, మహిళలకు చీరలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతగుంట్ల రాజాబాబు మాట్లాడుతూ ప్రభా స్ నేటి యువతరానికి ఆదర్శనమని అన్నారు. ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు అందరికి ఆదర్శనీయమని కొనియాడారు. స్వర్ణసుమంత్, ఏసురాజు, లాజర్, సుందరరావు, నాగసాయి, గోపీసాధిక్ పాల్గొన్నారు.

అమెరికా తెలుగు సాహితీ సదస్సులో రవీంద్రనాథ్



పుస్తకాలను ఆవిష్కరించిన డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పక్కన రవీంద్రనాథ్

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, పరిశోధకుడు ముత్తేవి రవీంద్రనాథ్ అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం, మిల్పీటస్ నగరంలో 21, 22 తేదీల్లో జరిగిన 13వ అమెరికా తెలుగు సాహితీ సదస్సులో పాల్గొన్నారు. ×తెలుగు సంస్కృతి– ఒక పరిచయం॰ అంశంపై ప్రత్యేక ప్రసంగం చేశారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, సిలికాన్ ఆంధ్ర యూనివర్శిటీ సంయుక్త ఆధ్వర్యంలో అదే యూనివర్శిటీలో జరిగిన సదస్సుకు అమెరికాలోని పలు రాష్ట్రాలు, కెనడా, బ్రిటన్ దేశాల్నుంచి పలువురు రచయితలు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. శతాబ్దాల తెలుగు జాతి ఉత్కృష్టమైన సంస్కృతిని స్థూలంగా వివరించిన రవీంద్రనాథ్, జనజీవనంలోని మానవీయమైన అంశాలు మాత్రమే కాలపరీక్షకు తట్టుకుని నిలబడి, ఆ జాతి జనుల సంస్కృతి అంతర్భాగం కాగలవని చెప్పారు. అనాగరిక, అమానవీయ, అశాస్త్రీయమైన ఆచారాలు, విశ్వాసాలు, సామాజిక కట్టుబాట్లు కాలక్రమంలో కలిసిపోక తప్పదని సోదాహరణంగా వివరించారు. రవీంద్రనాథ్ రచన ×తెనాలి రామకృష్ణకవి–శాస్త్రీయ పరిశీలన॰ పునరుద్ధరణ ప్రతిని, తాజా రచన ×కరణీకం॰ గ్రంథాన్నీ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించారు. తెనాలికి చెందిన ప్రసిద్ధ రచయిత ఆచార్య కొలకలూరి ఇనాక్, నిర్వాహకులు డాక్టర్ వంగూరి చిట్టెన్‌రాజు, డాక్టర్ కూచిభొట్ల ఆనంద్, డాక్టర్ సి.మృణాళిని సమక్షంలో రవీంద్రనాథ్‌ను సత్కరించారు.

రైతులే ఉప ఆహార ఉత్పత్తులు తయారీ శుభపరిణామం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



రైతు ఉత్పత్తిదారుల సంస్థ తయారు చేసిన సరుకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: రైతులు పండించిన పంటలతో ఆహార ఉత్పత్తులు తయారు చేసి అమ్మటం శుభపరిణామం అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మండల కేంద్రం కొల్లిపరలో శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రేష్ఠ స్మార్ట్ స్టోర్స్‌ను ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ అన్నెం సుబ్బారామిరెడ్డితో కలసి మంగళవారం ప్రారంభించారు. శివకుమార్ మాట్లాడుతూ కొల్లిపరలో 300 మంది రైతులు సంఘటితంగా ఏర్పడి సంస్థను ఏర్పాటు చేసుకుని వివిధ పంటలకు సంబంధించిన ఆహార ఉత్పత్తులను తయారు చేసుకుని వాటిని నేరుగా వినియోగదారులకు అమ్మటం ద్వారా మంచి ఆదాయం కలిగే వీలుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేసేందుకు తగిన సహాయసహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రేష్ఠ చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి, అగ్రి డీఎస్‌పి ఎండీ నెర్ల నరేంద్రరెడ్డి, డైరెక్టర్లు బొంతు గోపాలరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వుయ్యూరు సాంబిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన బతుకమ్మ ఉత్సవాలు



బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలు



చిన్నారులను అభినందిస్తున్న డాక్టర్ యశోద, గుడి చైర్మన్ రమేష్

తెనాలిటౌన్: పట్టణ రామస్వామిపేటలోని పట్టాభి రామస్వామిదేవస్థానంలో జరుగుతున్న బతుకమ్మ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. దసరా నవరాత్రి సందర్భంగా ఐదు రోజుల నుంచి వార్డు కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, వరలక్ష్మి, గాయత్రీల ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. కౌన్సిలర్ సంజీవరెడ్డి కుటుంబ సభ్యులు బతుకమ్మకు పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్‌వీఎస్ మల్లీశ్వరి, అర్చకులు వేదాంతం నాగమారుతీ, భక్తులు పాల్గొన్నారు. పట్టణ శివాజీచౌక్‌లోని కాళికామాత గుడి వద్ద నవరాత్రి ఉత్సవాలు ముగింపులో భాగంగా జంధ్యాల శ్రీరామ చంద్ర మూర్తి శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ పువ్వాద యశోద చిన్నారులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో గుడి చైర్మన్ గుమ్మడి రమేష్, యర్ర శ్రీనివాసరావు, కందెపి సీతారామయ్య, ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హైలెవల్ చానల్ పనులు వెంటనే పూర్తి చేయాలి



తెనాలిటౌన్: హైలెవల్ చానల్ నిర్మాణ పనులకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని హైలెవల్ చానల్ పోరాట కమిటీ కన్వీనర్ ములకా శివసాంబిరెడ్డి కోరారు. చానల్ పరిధిలోని 26 ఎకరాల్లో సాగులో ఉన్న వరి పంట నీరు లేక ఎండిపోతుందని, దీనికి నిరసనగా బుధవారం దుగ్గిరాలలోని జలవనరుల శాఖ కార్యాలయం వద్ద అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణ చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం కో–కన్వీనర్ యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావుతో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుతగా రైతులతో కలసి కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేట, తంగెళ్ళమూడి, శేకూరు గ్రామాల్లోని ఎండిపోతున్న పంట పొలాలను పరిశీలించినట్లు చెప్పారు. ఎకరానికి రూ.20వేలు నగదు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళేందకు ధర్నా చేపట్టామని చెప్పారు. సమావేశంలో రైతులు గోపిశెట్టి నరసింహారావు, సుంకర జయరాజు, ధూళ్ళ నాగరాజు, కోన నరసింహారావు, తోట శ్రీనివాసరావు, కనపర్తి మరియదాసు పాల్గొన్నారు.

చిన్నం యువరాజుకు జేఎన్‌టీయూ పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాల సాంకేతిక సలహాదారుడు చిన్నం యువరాజుకు కాకినాడలోని జేఎన్‌టీయూ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. 'జియో స్పేషియల్ టెక్నాలజీస్ అండ్ సాఫ్ట్ కంప్యూటింగ్ టూల్స్ ఫర్ డిసీస్ ప్యాటర్న్ డిఫ్యూజన్ ఎనాలసిస్ అండ్ మాపింగ్' అనే అంశంపై కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ ఆర్థిక సహకారంతో చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేస్తూ, జేఎన్‌టీయూ ఎవాల్యుయేషన్ డైరెక్టర్ బి.బాలకృష్ణ నోటిఫికేషన్ విడుదల చేశారు. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రొఫెసర్ అయ్యంకి మురళీకృష్ణ. ప్రముఖ పర్యావరణ ఇంజినీర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు చిన్నం యువరాజు పీహెచ్‌డీ పట్టా పొందినట్లు కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. కృత్రిమ మేథ సహకారంతో నూతన ఆవిష్కరణకు ఈ పరిశోధన దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ యువరాజుకు అభినందనలు తెలియజేశారు.

నిరుపేదల గుండెచప్పుడు ఎస్ఆర్ శంకరన్

లక్ష్మీపురం: జీవితమంతా పీడిత ప్రజల సంక్షేమం కోసం పాటుబడిన ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ బడుగు జన బాంధవుడిగా, నిరుపేదల గుండె చప్పుడుగా పేరొందారని సీనియర్ ఇంజినీర్ ఎన్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్వర్గీయ ఎస్.ఆర్.శంకరన్ సంస్మరణ సభలో ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి ఎస్.ఆర్. శంకరన్ జీవితం అంకితం చేశారన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం అనే పదానికి నిర్వచనం ఇచ్చి చట్ట పరిధిలో అమలు చేసిన ఆ మహనీయుడిని నేటి తరం అధికారులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పేదలకు ఉండాల్సిన హక్కుల్ని సంక్షేమ పథకాల్ని వారికే దక్కేలా శంకరన్ కృషి చేశారని గుర్తు చేశారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన సభ్యులు ఎస్ఆర్ శంకరన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్ధాబత్తినవారి వీధిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 16వేలు స్వాధీనం చేసుకున్నారు.